# మండలి చైర్మన్ రేసులో ఇక్బాల్

**రాష్ట్ర నేతల పరిశీలనలో మాజీ ఐపీఎస్**



ఫైల్ ఫోటో

**అనంతపురం, ప్రభన్యూస్ బ్యూరో :** శాసనమండలి చైర్మన్ రేసులో, హిందూపురం ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ మహ మ్మద్ ఇక్బాల్ ఉన్నట్లు వైసీపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుత చైర్మన్ మహమ్మద్ షరీఫ్ పదవీ కాలం ముగు స్తుండటంతో, శాసనమండలి చైర్మన్ ఎంపిక వ్యవహారం చర్చనీ యాం శంగా మారింది. హిందూపురం నియో జక వర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరపున ఎన్నికల బరిలో నిలిచారు.టీడీపీ అభ్యర్థి నందమూరి బాలకృష్ణపై పోటీ చేసి ఓడిపోయారు. వైసీపీలోని ఒకవర్గం వ్యతిరేకం గా పని చేయడంతో ఇక్బాల్ ఓడిపోవలసి వచ్చిం దని విమర్శలు బలంగా వినిపించాయి. అయితే ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహమ్మద్ ఇక్బాల్‌కు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించారు. కర్నూలు జిల్లాకు చెందిన మహమ్మద్ ఇక్బాల్ , వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మాట మేరకు హిందూపురానికి వచ్చి ఎన్నికల్లో పోటీ చేశారు. ఎన్నికల్లో ఓటమి పాలైన ఇక్బాల్‌కు పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్య మంత్రి ఎమ్మెల్సీపదవి ఇవ్వడమే కాకుండా, హిందూపురం ఇన్‌చార్జి బాధ్యతలు కూడా అప్ప జెప్పారు. తెలుగుదేశం ప్ర భుత్వ హయాంలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేసిన ఇక్బాల్ మంచి అధికారిగా గుర్తింపు పొందడమే కాకుండా, నిజాయితీగా వ్యవహరించే వ్యక్తిగా పేరుతె చ్చుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పని చేశారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రాయలసీమ పోలీస్ ఐజీగా పనిచేసి, నాలుగు జిల్లాల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, బాలికలకు అవసరమైనటువంటి వస్తువులు దాతల సహకారంతో పంపిణీ చేయిం చారు. పోలీసులను సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా చేసి అందరి మన్ననలు పొందారు. కాగా ఇక్బాల్ పదవీ విరమణ తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన్ను పట్టించుకోలేదు. అప ్పట్లో వైసీపీ నాయకుల ఆహ్వానం మేరకు... నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ప్రస్తుతం శాసనమండలి చైర్మన్ పదవీకాలం ముగియడంతో, ఇక్బాల్ ప్రస్తావన పార్టీలో వచ్చినట్లు జిల్లా నాయకులు చెబుతున్నారు. హిందూపురం నుంచి బాలకృష్ణపై పోటీ చేసిన మహమ్మద్ ఇక్బాల్‌కు శాసనమండలి చైర్మన్ అవకాశం కల్పిస్తే ... టీడీపీ కంచుకోట పై తమ ఆధిక్యతను నిలుపుకునే అవకాశం ఉంటుందని, ఇప్పటి వరకు ఆ నియోజకవర్గం నుంచి ఎన్టీఆర్ కుటుంబం మినహాయిస్తే ఏ ఒక్కరికీ ఉన్నత పదవులు దక్కలేదని, తిరిగి మహమ్మద్ ఇక్బాల్ కు అవకాశం ఇస్తే... వైసీపీ తరపున హిందూపురం లో మంచి గుర్తింపు ఇచ్చినట్టు అవుతుందని పార్టీ వర్గాలు బావిస్తున్నాయి. మైనార్టీల విషయంలో ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుండడంతో ఈసారి కచ్చితంగా ఇక్బాల్‌కు అవకాశం దక్కుతుందని ఆ పార్టీ నేతలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణకు మంత్రి అవకాశం కల్పించారు. రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి విప్ అవకాశం ఇచ్చారు. మహమ్మద్ ఇక్బాల్ కు మండలి చైర్మన్ చేస్తే... జిల్లాకు మరింత ప్రాధాన్యత కల్పించినట్లు అవుతుందని ఆ పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# విచారణ ఖైదీల విడుదల

- 90 రోజుల మధ్యంతర బెయిల్‌కు అనుమతి
- కరుడు కట్టిన వారిని వదలొద్దు
- జైళ్లలో నియమావళి తప్పనిసరి
- సుప్రీం మార్గదర్శకాలు అమలు చేయండి
- హైకోర్టు ఆదేశాలు

**అమరావతి, ఆంధ్రప్రభ:** కోవిడ్ నేపథ్యంలో సాధారణ, విచారణలో ఉన్న ఖైదీలను మధ్యంతర బెయిల్‌పై విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. కోవిడ్ ఉధృతిని దృష్టిలో ఉంచుకుని జైళ్లలో సుప్రీం కోర్టు మార్గదర్శకాలను విధిగా అమలు చేయాలని స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర దొంగలు, అత్యాచార, పోక్సో కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఖైదీలకు ఈ ఆదేశాలు వర్తించవని తేల్చి చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో ఖైదీల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి కరోనా సోకిన వారికి వెంటనే వైద్యం అందించాలని ఆదేశించింది. జువైనల్ హోమ్స్‌లో కూడా నిబంధనలు పాటించాలని సూచించింది. ఏడేళ్లు అంతకంటే తక్కువ శిక్షపడే కేసుల్లో నిందితుల అరెస్ట్ విషయంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోవాలి.. జైల్లోనే ఉండిపోయే ఖైదీలకు వైద్యం అందించటంతో పాటు ఒకసారి మధ్యంతర బెయిల్‌పై విడుదలై తిరిగి జైలుకు వచ్చిన వారిని, విచారణలో ఉన్న అండర్ ట్రయల్ ఖైదీలకు 90 రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేయాల్సిందిగా రాష్ట్రంలోని జిల్లా ప్రిన్సిపల్ జడ్జిలు, జైళ్ల అధికారులను ఆదేశించడంతో పాటు తాజాగా ఏడేళ్లలోపు కేసుల విచారణ విషయంలో సుప్రీం మార్గదర్శకాలను అమలు చేసేలా డీజీపీ, పోలీస్ శాఖను ఆదేశించాలని హోంశాఖ కార్యదర్శికి సూచనలిచ్చింది.



**మేజిస్ట్రేట్లు అందుబాటులో ఉండాలి**

ఖైదీల మధ్యంతర బెయిల్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు బాండ్ల ఆమోదానికి ఆ ప్రాంత మేజిస్ట్రేట్లు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. జైలు సూపరింటెండెంట్ కోరినప్పుడు ఈ ప్రక్రియ నిర్వహించాలని మేజిస్ట్రేట్ సంతృప్తి మేరకే బాండ్లు చెల్లుబాటులో ఉంచాలని వివరించింది. మొత్తం 90 రోజుల పాటు మధ్యంతర బెయిల్ అమల్లో ఉంటుందని ఖైదీలు విడుదలైన తరువాత 14 రోజుల పాటు హోం క్వారెంటైన్‌లో ఉండేలా తగిన పత్రాలు తీసుకోవాలని ఆదేశాలను విస్మరించే వారి బెయిల్ రద్దు చేయాలని కూడా ఆదేశాలు జారీ చేసింది.

గత ఏడాది ఉన్నత స్థాయి కమిటీ తీర్మానాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అరూప్‌కుమార్ గోస్వామి అర్హత కలిగిన ఖైదీలను మధ్యంతర బెయిల్‌పై విడుదల చేసేందుకు న్యాయమూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ కన్నెగంటి లలితతో కూడిన ధర్మాసనం విచారణ జరపాల్సిందిగా ఆదేశించారు. సుమోటో రిట్ పిటిషన్‌గా గత రెండు రోజులుగా ధర్మాసనం విచారణ జరిపింది. కరోనా నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో పరిస్థితులు, ఖైదీల విడుదలపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, జైళ్ల శాఖ డీజీ మహ్మద్ అసన్ రెజా తదితరుల ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీ ఇటీవలే సమావేశమై పలు తీర్మానాలు చేసింది. వీటిపై విచారణ జరిపిన ధర్మాసనం రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో ఆరోగ్య ప్రమాణాలు, ఖైదీలపై ఆరా తీసింది. ఇందులో భాగంగా విచారణలో ఉన్న ఖైదీలకు మధ్యంతర బెయిల్‌తో పాటు జైళ్లలో పారిశుద్ధ్యం, వైద్య సేవలపై తగిన సూచనలిచ్చింది. సామాజిక కారణాల రీత్యా జైలు నుంచి వెళ్లదలచుకోని ఖైదీలకు కారాగారాల్లోనే కరోనా చికిత్స నిర్వహించాలని ఇతర ఖైదీలకు వ్యాప్తి చెందకుండా నియంత్రించాలని ఆదేశించింది. జువైనల్ హోమ్స్‌లో కోవిడ్ ప్రోటోకాల్‌ను కఠినంగా అమలు చేయాలని స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాలు 8 వారాల పాటు అమల్లో ఉంటాయి.. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. అప ్పటి వరకు జిల్లా ప్రిన్సిపల్ జడ్జిలు, జైలు అధికారులు మార్గదర్శకాలను పాటించాలని వివరించింది. కాగా రాష్ట్రంలో నాలుగు సెంట్రల్ జైళ్లు, వివిధ జిల్లా జైళ్లలో 6905 మంది ఖైదీలు ఉన్నారని జైళ్లశాఖ డీజీ ధర్మాసనం దృష్టికి తెచ్చారు. సెంట్రల్ జైళ్లలో 3764 మందికి గాను 4041 మంది, జిల్లా జైళ్లలో 1711కు గాను 1007 మంది, రెండు మహిళా జైళ్లలో 280 మందికి గాను 140 మంది, 10 సబ్ జైళ్లలో 802 మందికి 625 మంది శిక్షను అనుభవిస్తున్నారని, మరి కొందరు రిమాండ్ ఖైదీలుగా ఉన్నారని వివరించారు. అంతర్రాష్ట్ర దొంగలు మధ్యంతర బెయిల్‌పై విడుదలైన తరువాత వారి ఆచూకి తెలీటంలేదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె శ్రీనివాసరెడ్డి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. దోపిడీ, దొంగతనంతో పాటు హత్యలు చేసిన ఖైదీలకు ఈ ఆదేశాలు వర్తింపచేయరాదని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఎన్నికలపై హైకోర్టు తీర్పు చెంపపెట్టు

- ప్రశ్నించిన వారిపై దాడులకు దిగుతున్నారు
- మాస్క్ అడిగిన పాపానికి డా. సుధాకర్ ప్రాణాలు పోగొట్టారు
- విలేకరుల సమావేశంలో చంద్రబాబు



**అమరావతి, ఆంధ్రప్రభ:** నిబంధనలు ఉల్లంఘించిన అన్ని అంశాల్లో ముఖ్యమంత్రికి కోర్టుల్లో చీవాట్లు పడ్డాయని ప్రతిపక్ష నేత, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కరోనా విలయతాండవం చేస్తోందని, ఆసుపత్రుల్లో ఆక్సిజన్ కొరతతో ప్రజల ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు బ్లాక్ ఫంగస్ వ్యాధి ప్రజల ప్రాణాలను హరిస్తోందని, ప్రజలందరూ ఆవేదనతో ఉంటే ప్రభుత్వం మాత్రం అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కక్ష సాధింపులకు దిగుతోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో ఆనందయ్య ఆయుర్వేదంతో కరోనాను కంట్రోల్ చేస్తానని ముందుకు వచ్చినప్పుడు ప్రభుత్వం ఆడిన నాటకాలు అన్నీఇన్నీ కాదని, ఆయుర్వేదం మందు ఎంత వరకు పని చేస్తుందో పరిశోధనలు చేయించాలని, అలా కాకుండా ఆనందయ్యను బెదిరించి, కస్టడీలోకి తీసుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఆయుర్వేదం మెడిసిన్ మీద నిజనిర్ధారణ జరగాలని, బాగా పని చేస్తే కేంద్రానికి చెప్పాలని చంద్రబాబు సూచించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల గురించి హైకోర్టు వెలువరించిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని, అలాంటి తీర్పులు ఎన్ని వచ్చినా, న్యాయస్థానాలు ఎన్ని మొట్టికాయలు వేసినా ప్రభుత్వంలో చలనం లేదని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఎంపీ రఘురామకృష్ణం రాజు పోలీసు కస్టడీలో గాయపడ్డారని మిలటరీ ఆసుపత్రి నివేదికతో నిర్ధారణ అయిందని, ఆయనను సీఐడీ పోలీసులు కొట్టారనే ఆరోపణలకు బలం చేకూరిందని అన్నారు. రాజకీయ దురుద్దేశాలతో పెట్టిన రాజద్రోహం కేసులో సుప్రీంకోర్టు రఘురామకు బెయిల్ మంజూరు చేసిందన్నారు. సుప్రీం కోర్టు ఆర్డర్‌ను ఉల్లం ఘించి ఇష్టప్రకారం చేశారని కోర్టు చెప్పిందని, ఆ తీర్పుపై అసంతృప్తిగా ఉన్నామని సజ్జల రామ కృష్ణారెడ్డి మాట్లాడటం సిగ్గుచేటని చంద్రబాబు వ్యాఖ్యానించారు.. సుప్రీంకోర్టు ఆర్డర్ కన్నా ముఖ్యమంత్రి ఆర్డరే ముఖ్యమన్నట్లుగా ఎస్ఈ సీ వ్యవహరించారని, రూ. 160 కోట్లు ప్రజా నిధులు దుర్విని యోగం చేశారని ఆరోపించారు. 151 సీట్లు వచ్చాయి.. ఏదైనా చేస్తామని చెబుతున్నారని, అలా ఇష్టానుసారంగా చేసుకోవడానికి ప్రజలు మీకు ఓటు వేయలేదని స్పష్టం చేశారు. దళిత డా. సుధాకర్ అకాల మరణం ప్రభుత్వ హత్యే నని చంద్రబాబు ఆరోపించారు. సర్జరీలు చేసే వారికి కరోనా పరిస్థితుల్లో మాస్కులు ఇవ్వాలని అడిగారని, మాస్కు అడిగినందుకు పిచ్చోడనే ముద్ర వేసి వేధించడంతోనే గుండెపోటుతో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అప్పుల ఊబిలో రాష్ట్రం**

రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, రెండేళ్లలో ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు ఏడాదికి రూ. 86 వేల కోట్ల అప్పు చేసే పరిస్థితికి వచ్చాయని, ఏ విధంగా తిరిగి కడతారని ప్రశ్నించారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని అప్పులను దొడ్డిదారిన చేస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో మాట్లాడే పరిస్థితి లేదనే మాక్ అసెంబ్లీ జరుపుకొన్నామన్నారు. కరోనా పేరుతో దోచుకోవడం ఎక్కువైపోయిందని, ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తున్నారని చంద్రబాబు ఆరోపించారు. ప్రభుత్వానికి చేతనైతే కరోనాను కంట్రోల్ చేయాలని, కరోనాపై అఖిలపక్షం సమావేశం ఎందుకు పెట్టడం లేదని అడిగారు. వ్యాక్సిన్ల కొనుగోలు కోసం రూ. 500 కోట్లు ఏమూలకు సరిపోతాయని చంద్రబాబు ప్రశ్నించారు.

## విశాఖ ఉక్కు కోసం ఎలాంటి త్యాగాలైనా చేస్తాం

కరోనా విపత్కర కాలంలో రోజుకు 150 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి చేసి దేశానికే విశాఖ ఉక్కు కర్మాగారం ఊపిరి పోసిందని, అలాంటి పరిశ్రమ పరిరక్షణ కోసం తెలుగుదేశం ఎప్పటికీ కట్టుబడి ఉంటుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం ఒక ట్వీట్‌లో విశాఖ ఉక్కును కబళించాలని కొందరు వైసీపీ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. వెయ్యి పడకలతో కోవిడ్ కేర్ సెంటర్ ఏర్పాటుకు కూడా ముందుకు వచ్చి ఎన్నో ప్రాణాలు కాపాడుతున్న విశాఖ ఉక్కు కోసం ఎలాంటి త్యాగాలకైనా టీడీపీ సిద్ధంగా ఉందన్నారు.

**పోరాడుతూనే ఉంటాం:నారా లోకేష్**

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ గత 100 రోజులుగా పోరాటం చేస్తున్న కార్మికులకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఉద్యమాభివందనాలు తెలిపారు. విశాఖ ఉక్కుని తుక్కు రేటుకి కొట్టేసి కార్మికుల ఊపిరి తియ్యాలని చేస్తున్న కుట్రలను సాగనివ్వబోమన్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు ఆక్సిజన్ సరఫరా చేసి కరోనా రోగులకు స్టీల్ ప్లాంట్ కార్మికులు ఊపిరి పోశారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో దొంగ తీర్మానాలు, ఢిల్లీలో పాదసేవ మాని చిత్తశుద్ధితో ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం పోరాడాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకూ తెలుగుదేశం పార్టీ పోరాడుతూనే ఉంటుందని లోకేష్ స్పష్టం చేశారు.

# డా.సుధాకర్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

- బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు



**అమరావతి, ఆంధ్రప్రభ:** మాస్కులు అడిగిన పాపానికి డా. సుధాకర్‌ను వేధించి వెంటాడిన రాష్ట్ర ప్రభుత్వం, చివరికి ప్రాణాలు తీసేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చె న్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఒక ప్రకట నలో సుధాకర్ మరణం ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన ఓ వైద్యుడి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన దుర్మార్గపు వైఖరే ఆయన మరణానికి కారణమని మండిపడ్డారు. ప్రాణం విలువ తనకు బాగా తెలుసునన్న ముఖ్యమంత్రికి కక్షలు కార్పణ్యాలు తప్ప.. ప్రాణం విలువ తెలియదనడానికి సుధాకర్ మరణమే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వేధింపుల కారణంగా ప్రాణాలు కోల్పోయిన సుధాకర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబ సభ్యులకు సీఎం జగన్ క్షమాపణలు చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

**దళితులపై జరుగుతున్న దమనకాండకు ఇదే ప్రత్యక్ష సాక్ష్యం**

వైసీపీ పాలనలో దళితులపై జరుగుతున్న దమనకాండకు డా. సుధాకర్ మరణమే ప్రత్యక్ష సాక్ష్యమని, ఇది రాష్ట్ర చరిత్రలో దళిత జాతికి జరిగిన ఘోర అవమానమని టీడీపీ సీనియర్‌నేతలు పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, వేర్వేరు ప్రకటనల్లో ఎమ్మెల్యే డోలా బాలవీరాంజనేయ స్వామి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాస్కులు అడిగిన పాపానికి డా. సుధాకర్‌ను మానసికంగా వేధించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వేధింపుల వల్లే మానసిక క్షోభకు గురై చనిపోయారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని స్పష్టం చేశారు. డా. సుధాకర్ కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని, వారి కుటుంబంలో వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అంతకుముందు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో డా. సుధాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఏయూ మాజీ వీసీ ఆచార్య సింహాద్రి మృతి

**వర్సిటీ అధికారులు సంతాపం**



**విశాఖ ఎడ్యుకేషన్, ప్రభ న్యూస్:** ఆంధ్రవిశ్వ విద్యాలయం మాజీ ఉపకుల పతి ఆచార్య వైసీ సింహాద్రి విశాఖలో ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మరణించారు. ఆంధ్రవిశ్వ విద్యాలయం సోషల్ వర్క్ విభాగం ఆచార్యునిగా ఆయన సుదీర్ఘ కాలం పనిచేశారు. వర్సిటీ 13 వ ఉపకులపతిగా 2002 ఏప్రియల్ 3 నుంచి 2005 ఏప్రియల్ 2 వ తేదీ వరకు పని చేశారు. ఆయన హాయంలో విశ్వవిద్యాలయంలో అనేక సంస్కరణ లకు నాంధి పలికారు. క్రమశిక్షణకు, సమయ పాలనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఆయన మూడేళ్ల కాలంలో విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఆంధ్రవిశ్వవిద్యాల యానికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయాలకు ఆయన ఉపకులపతిగా సేవలు అందించారు. తన సమర్ధ నాయకత్వం లో దేశ వ్యాప్తంగా ఆయన పేరు గాంచారు. పదవీ విరమణ తరువాత సైతం ఆయ న సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ సేవలు అందించారు. ఆచార్య వై.సి సింహాద్రి మృతికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి. ప్రసాద రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. దార్శినికత కలిగిన విద్యా వేత్తను కోల్పోవడం విచారకరమన్నారు. ఆచార్య సింహాద్రి మృతికి ఏయూ రెక్టార్ ఆచార్య కె. సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి. క్రిష్ణమోహన్‌లు తమ ప్రగాడ సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రొఫెసర్ సింహాద్రి మృతి పట్ల హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ సంతాపం



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఆంధ్ర యూనివర్సిటీ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, బెనారస్ హిందూ యూనివర్సిటీ, పాట్నా యూనివర్సిటీల మాజీ ఉప కుల పతి ప్రొఫెసర్ వైసీ సింహాద్రి మృతి పట్ల హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ గారు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ మేరకు సిమ్లా రాజ్ భవన్ నుంచి ఆయన ఒక ప్రకటన చేస్తూ ప్రొఫెసర్ వైసీ సింహాద్రి విదేశాల్లో ఉన్నతమైన సోషియాలజీలో డాక్టరేట్ పొందిన మంచి విద్యావేత్త అని, క్రమశిక్షణ కలిగినటువంటి అధికారి అని దత్తాత్రేయ పేర్కొన్నారు. ప్రొఫెసర్ వై.సి.సింహాద్రి మృతి విద్యా రంగానికి, జాతీయ భావాలు కలిగిన సంస్థలకు తీరని లోటు అని పేర్కొన్నారు. సింహాద్రి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు.

# రూ.4.25 లక్షల గంజాయి పట్టివేత

- 17 కిలోల గంజాయి, 8 మొబైల్, వేయింగ్ మిషన్ స్వాధీనం
- పది మంది నిందితుల అరెస్ట్



**కర్నూల్, ప్రభన్యూస్ బ్యూరో :** కర్నూలు జిల్లా కేంద్రంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నిరంతరం మత్తులో ముంచెత్తే.. గంజాయి వినియోగం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ క్రమంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై దృష్టి సారించిన కర్నూలు ఎస్ఈబీ పోలీసులు శనివారం జిల్లా కేంద్రంలో దాడులు నిర్వహించి, భారీగా గంజాయి పట్టుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ. 4.25 లక్షలు ఉంటుందని సెబ్ అడిషనల్ ఎస్పీ గౌతమ్ శాలినీ వెల్లడించారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 10 మంది నిందితులను అరెస్టు చేశారు. వీరితో పాటు 11 ఎల్ఎస్‌డి స్టాంప్, బ్లాట్స్, 8 మొబైల్ ఫోన్లు, ఒకవేయింగ్ మిషన్ ను స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని ప్రకాశం జిల్లా, గిద్దలూరు మండలం తుని గ్రామం నుంచి కొనుగోలు చేస్తున్నారు. జిపే యాప్‌ను ఉపయోగించి ఇండియన్ కరెన్సీ ని బిట్కాయిన్‌గా మార్చి ఆ డబ్బులతో ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో సమాచారం అందుకున్న కర్నూలు మూడో పట్టణ పోలీసులు జిల్లా ఎస్పీ పకీరప్ప ఆదేశాల మేరకు, కర్నూల్ సబ్ డివిజినల్ పోలీస్ అధికారి కె.వి మహేష్ ఆధ్వర్యంలో మూడో పట్టణ సీఐ తబ్రేజ్, సబ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు నుంచి అరుంధతి నగర్‌కు వెళ్తున్న రహదారిలో ఓ పాడుబడిన ఇంటిలో గంజాయి విక్రయించే నిందితులు ఉండగా పసిగట్టారు. మొత్తం 10 మంది వద్దసోదా చేయగా 17 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో కర్నూలు నగరంలోని కడకుపురకు చెందిన మహమ్మద్ వసీం, కర్నూల్ బి. తాండ్రపాడులోని పోలీస్ కాలనీకి చెందిన షేక్ పిరోజు బాషా, వడ్డెరకు చెందిన షేక్ సాహెబ్ బాషా, వన్ టౌన్ చెందిన జహీర్ అలీ ఖాన్, చిత్తారి వీధి కి చెందిన షేక్ షహీద్ బాషా, కవాడీ వీధికి చెందిన షేక్ మహమ్మద్ సోహైల్, బి తాండ్రపాడు మంగళగిరి చెందిన చాకలి దస్తగిరి, నెహ్రూనగర్ కు చెందిన అగ్ని మిత్ర, గుంటూరు జిల్లా లేమల్లెపాడు క ు చెందిన భీమినేని భరత్ చంద్ర, ఇదే జిల్లా ఫాతిమా పురంకు చెందిన కాటమాల జోసెఫ్‌లను అరెస్టు చేశారు. వీరు కర్నూల్ నగరంతోపాటు, జిల్లాలోని వివిధ కేంద్రాల్లో 20 గ్రాముల గంజాయిని రూ. 500 అమ్ముతున్నట్లు గుర్తించారు. ఇలా అమ్మకం సాగించిన డబ్బులతో ఆన్‌లైన్‌లో బిట్ కాయిన్‌ను రూ.1000 కొనుగోలు చేసి వాటిని రూ. 2500 అమ్ముతున్నారు. ఈ కేసుకు సంబంధించి మరొకరు పరారీలో ఉన్నట్లు అడిషనల్ ఎస్పీ వెల్లడించారు. నిందితులపై నార్కోటిక్ డ్రగ్స్, సైకో ట్రోఫిక్ సబ్ యాక్ట్ 1985 కింద కేసులు నమోదు చేస్తున్నట్లు సెబ్ అడిషనల్ ఎస్పీ వెల్లడించారు. ఈ కేసును ఛేదించిన మూడో పట్టణ పోలీసులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# కోర్టు ధిక్కార స్వరంతోనే ఆ వ్యాఖ్యలు

- పునరావృతమైతే చర్యలకు వెనుకాడేదిలేదు
- ఏఏజీ పొన్నవోలుపై హైకోర్టు ధర్మాసనం ఫైర్

**అమరావతి, ఆంధ్రప్రభ:** మీ వ్యాఖ్యలు కోర్టు ధిక్కార స్వభావాన్ని కలిగి ఉంటున్నాయి.. న్యాయవాదులు స్వీయ నియంత్రణ పాటించాలి.. పదజాల ప్రయోగంలో హుందాగా వ్యవహరించాలి.. అంతేకానీ కంట్రోల్ తప్పి మాట్లాడటం సమంజసం కాదు.. వాదనల సమయంలో ఆచితూచి పదాలను ప్రయోగించాలి.. ఇదే తీరు పునరావృతమైతే చర్యలు తీసుకునేందుకు కోర్టు వెనుకాడబోదు.. ఇది ప్రాథమి కంగా బార్ కౌన్సిల్‌కు నివేదించేందుకు తగిందిగా భావించాల్సి వస్తోందని హైకోర్టు ధర్మాసనం రాష్ట్రఅదన పు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డిపై అసహనం వ్యక్తం చేసింది.. నర్సాపురం ఎంపీ రఘురామ కృష్ణంరాజు కేసులో సీఐడీ అదనపు డీజీ, ఎస్‌హెచ్‌ఓలపై కోర్టు ధిక్కార చర్యలకు ఆదేశిస్తూ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్, జస్టిస్ కన్నెగంటి లలితలతో కూడిన ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. ఈ సందర్భంగా పొన్నవోలు వ్యాఖ్యలను ధర్మాసనం అభిశంసిస్తూ తీర్పు వెలువరించింది. జస్టిస్ లలిత సుధాకర్ రెడ్డి తీరును తప్పుపడుతూ తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారు. సుమారు 16 పేజీల ఈ తీర్పు ప్రతుల్లో 15 పేజీలు జస్టిస్ లలితకు సంబంధిం చినవి కాగా జస్టిస్ చాగరి ప్రవీణ్‌కుమార్ ఒకే ఒక్క పేజీలో తన తీర్పును వినిపించారు. పొన్నవోలు వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయంటూ చర్యలు చేపట్టేందుకు ఉపక్రమించనున్నట్లు జస్టిస్ లలిత తీర్పు సారాంశమనేది స్పష్టంగా అవగతమవుతోంది. ఆయన వ్యవహారశైలిపై బార్ కౌన్సిల్‌కు నివేదించనున్నట్లు స్పష్టమవుతోంది.. ఎంపీ రఘురామకృష్ణంరాజుకు సుప్రీం కోర్టులో బెయిల్ మంజూరైన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడటం న్యాయవాద వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ లలిత తీవ్ర స్థాయిలో పొన్నవోలు వ్యాఖ్యలను తప్పుపడితే ధర్మాసనంలోని మరో న్యాయమూర్తి జస్టిస్ ప్రవీణ్‌కుమార్ 12 లైన్లలోనే ఉత్తర్వులను ముగించటం విశేషం. కోర్టు వాదనల్లో స్వీయ నియంత్రణ పాటించాలనేది ఓ ప్రమాణ చిహ్నం.. వాదనల సమయంలో కోర్టు హాల్లో హుందాగా, స్పష్టమైన పదాలను ఉచ్చరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. జాతీయ లీగల్ వెబ్‌సైట్లలో కూడా ఈ ఉత్తర్వులపై చర్చ సాగుతోంది.

## ఫైర్ డైరెక్టర్ జయరామ్ మృతి పట్ల హోంమంత్రి దిగ్భ్రాంతి



**అమరావతి, ఆంధ్రప్రభ:** ఏపీ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జయరామ్ నాయక్ మృతి పట్ల హోంశాఖ మంత్రి మేకతోటి సుచరిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఒక ప్రకటనలో జయరామ్ నాయక్ హార్ట్ స్ట్రోక్ రావడంతో విజయవాడలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. జయరామ్ మరణ వార్త విస్మయానికి గురిచేసిందని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నానన్నారు. అనుకోని సంఘట కారణంగా తీవ్ర విషాదంలో ఉన్న కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతున్నానన్నారు. అగ్నిమాపక విభాగంలో జయరామ్ నాయక్ అత్యుత్తమ సేవలందించారని గుర్తుచేశారు. జయరామ్ కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హోంమంత్రి సుచరిత భరోసానిచ్చారు.

# కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవాలి

- ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయం మానుకోండి
- మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, ప్రభన్యూస్ :** నష్టాల్లో ఉందనే సాకుతో విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయలనే ఆలోచన ఇప్పటికైనా వెనక్కి తీసుకోవాలని మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు కేంద్రాన్ని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరించొద్దని కోరుతూ ఉక్కు పరిశ్రమ ఉద్యోగులు. కార్మికులు తలపెట్టిన ఉద్యమం 100 రోజులకు చేరింది. ఈ సందర్భంగా గంటా శ్రీనివాస్ తన ట్విట్టర్ ఖాతాలో కేంద్రానికి తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ ప్రకటన చేసినప్పటి నుండి ఓ పక్క ప్రశాంతంగా నిరసన ప్రదర్శనలు చేస్తూనే మరో పక్కన కోవిడ్ విపత్తు పరిస్థితి గమనించి శక్తిమేర అవసరమైన ఆక్సిజన్ ఉత్పత్తి అనేక మంది ప్రాణాలకు ఊపిరి పోయడం వారి స త్తా న ు చా ట ు త ు ం ద ని పేర్కొన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం 26 వేల ఎకరాల భూములు త్యాగం చేసిన , ప్రాణాలు అర్పించిన వారి లక్ష్యం దారి తప్పకూడదని భావించారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులకూ కార్మికులకూ సత్తా లేకపోవడం కాదనీ విపత్కర పరిస్థితుల్లోనూ రోజుకు150 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి చేసి పొరుగు రాష్ట్రాల కోవిడ్ బారినపడ్డ పేషెంట్లకు సరఫరా అయ్యేలా చేసిన సామర్థ్యం, సమర్థత విశాఖ ఉక్కు పరిశ్రమ శక్తి యుక్తులను చాటుతుందని భావిం చారు. ఇప్పటికైనా సొంతగనులను కేటాయించి విశాఖ స్టీల్ ప్లాంట్ భవిష్యత్తును నిలబెట్టాలని మాజీ మంత్రి గంట శ్రీనివాసరావు ఆశించారు.


NELCAST LIMITED

CIN : L27109AP1982PLC003518
Regd. Office: 34, Industrial Estate, Gudur - 524 101.
Tel : 08624 - 251266. Fax : 08624 - 252066.
Website : www.nelcast.com Email: nelcast@nelcast.com

NOTICE

Notice is hereby given pursuant to Regulation 29 read with Regulation 47 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015 that a Meeting of the Board of Directors of the Company will be held on Monday, the 31st May 2021 to consider and take on record Standalone and Consolidated Audited Financial Results of the Company for the quarter and year ended 31st March 2021 and recommendation of dividend if any, for the financial year ended 31st March 2021.
This intimation is available on the website of the Company, www.nelcast.com and also on the website of the Stock Exchanges, www.bseindia.com and www.nseindia.com.

For NELCAST LTD.
(S.K. SIVAKUMAR)
Company Secretary
Place: Gudur
Date : 22nd May 2021.